సాక్షి
పార్వతీపురం మన్యం
గురువారం । 27 । జూలై । 2023



గుర్లలో కృషి విజ్ఞాన కేంద్రం
గుర్ల మండలం ఎస్ఎస్ఆర్ పేటలో కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి తీర్మానించింది. - 8లో



నాణ్యమైన భోజనం అందించాలి
విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కంబాల జోగులు హెచ్చరించారు. - 8లో



పేదోడి సొంతింటి కల సాకారం
పేదవాడి సొంతింటి కల జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో సాకారమవుతోందని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

సంగాంలో ఏనుగుల సంచారం



సంగాంలో ఏనుగుల సంచారం

వంగర: మండల పరిధి సంగాం–మగ్గూరు గ్రామాల మధ్య ఏనుగులు బుధవారం సంచరించాయి. నాలుగు రోజులుగా వంగర మండలంలో ప్రవేశించి పంటలు ధ్వంసం చేస్తూ... ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. చెరకు, మొక్కజొన్న, వరి పంటలకు నష్టం కలిగిస్తున్నాయి. ఏనుగులు సంచరిస్తున్న ప్రదేశాల్లో ఎలిఫెంట్ టీకర్స్ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

34.54 కేజీల గంజాయి స్వాధీనం



ముద్దాయిలను చూపిస్తున్న పోలీసులు

సాలూరు: ద్విచక్రవాహనంపై గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్టు రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి బుధవారం తెలిపారు. దండిగాం కూడలి వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేపడుతుండగా ద్విచక్రవాహనంపై గంజాయి తరలిస్తున్న ఒడిశాకు చెందిన రవి అలియాస్ జోసఫ్, మైరా అలియాస్ రితీష్, బీహార్ రాష్ట్రానికి చెందిన దీపుకుమార్ అలియాస్ మున్నాలను అరెస్టు చేసామని తెలిపారు. వారి నుంచి 34.54 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని రిమాండ్‌కు తరలించామన్నారు.

28 నుంచి విజయవాడలో సీ ఫుడ్ ఫెస్టివల్

పార్వతీపురం: విజయవాడలోని ఎ–కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 28, 29, 30 తేదీల్లో సీ ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేస్తామని జిల్లా మత్స్యశాఖాధికారి వి.తిరుపతయ్య బుధవారం తెలిపారు. ఈ మేరకు ఫుడ్‌ఫెస్టివల్ పోస్టర్‌ను ఆయన జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో విడుదల చేశారు. సీ ఫుడ్ ఫెస్టివల్‌ను మత్స్యశాఖ, భూమి ఆర్గానిక్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తోందన్నారు. ఫిష్ ఆంధ్రా మినీ షాపులు, ఫిష్ ఆంధ్రా స్పోక్స్ రూ.10లక్షల యూనిట్లు, రూ.20 లక్షల యూనిట్లు, రూ.50 యూనిట్లు, కోటి రూపాయల విలువగల ఆక్వాహబ్ యూనిట్లను ప్రమోట్ చేసేందుకు, చేపల ఉత్పత్తుల వినియోగం వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను తెలియజేయడమే సీ ఫుడ్ ఫెస్టివల్ ఉద్దేశంగా పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 8946965555, 9381870494 నంబర్లను సంప్రదించాలన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం
- జిల్లా మలేరియా అధికారి శ్యామ్‌కుమార్



ఎల్విన్‌పేట పీబీ కాలనీలో డెంగీ సోకిన వ్యక్తి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న శ్యామ్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: దోమల నివారణతో మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులకు దూరం కావచ్చని జిల్లా మలేరియా అధికారి శ్యామ్‌కుమార్ అన్నారు. ఎల్విన్‌పేట గ్రామం పీబీ కాలనీకి చెందిన రాజు అనే వ్యక్తికి డెంగీగా నిర్ధారణ కావడంతో ఆయన గృహాన్ని బుధవారం పరిశీలించారు. ఇంటి ఆవరణలో ఏఎల్వో ద్రావణాన్ని పిచికారీ చేయించారు. ఇంట్లో ఉన్న నీటి నిల్వలను పరిశీలించి పారబోయించారు. కాలనీలో ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తలనొప్పి, కండరాలు, కీళ్లు లేదా ఎములకనొప్పి, దద్దుర్లు, వికారం, వాంతులు వంటి లక్షణాలుంటే తక్షణమే వైద్యసేవలు పొందాలని సూచించారు. ఆయన వెంట కన్సల్టెంట్ రామచంద్రారావు, సీహెచ్ఓ పద్మావతి, వైద్య సిబ్బంది ఉన్నారు.

కిలో టమోటో రూ.50

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఉన్న అన్ని రైతు బజార్లలో గురువారం నుంచి రాయితీపై కిలో టమోటోలను రూ.50కు విక్రయిస్తామని మార్కెటింగ్‌శాఖ ఏడీ ఐ.గంగాధర్ తెలిపారు. కిలో రూ.127.37 చొప్పున ప్రభుత్వం టమోటోను కొనుగోలుచేసి రాయితీపై అందిస్తున్నట్టు వెల్లడించారు. జిల్లాకు 5,148 కిలోల టమోటో రానుందని తెలిపారు. విజయనగరంలోని ఆర్అండ్‌బీ, దాసన్నపేట, రూరల్‌పోలీస్ స్టేషన్ వద్దఉన్న రైతు బజార్లతో పాటు కొత్తారు బొబ్బిలి, ఎస్.కోట, చీపురుపల్లి, రాజాం రైతు బజార్లలో విక్రయాలు సాగుతాయన్నారు.

జోరు వాన

- పార్వతీపురం మన్యం జిల్లాలో విస్తారంగా వర్షాలు
- రిజర్వాయర్లకు జలకళ
- నదులకు వరదనీటి తాకిడి
- నిండుకుండలా చెరువులు
- తోటపల్లి కాలువకు గండి

పార్వతీపురం:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా బుధవారం వర్షాలు కురిశాయి. కొన్నిచోట్ల కుండపోత వర్షం కురిసింది. గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు నదులు, వాగుల్లో వరదనీటి ప్రవాహం పెరిగింది. జలాశయాలు, కొన్ని చెరువులు నిండుకుండలా మారాయి. లోతట్టు ప్రాంతాలను వర్షపునీరు ముంచెత్తింది. మరో నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. సహాయక చర్యల్లో నిమగ్నమైంది. ఖరీఫ్ సమయంలో వర్షాలు అనుకూలించడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ ఏడాది సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని చెబుతున్నారు. జిల్లాలో 115.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



సంతకవిటి: నాగావళి నదిలో నారాయణపురం ఆనకట్ట వద్ద నీటి ప్రవాహం

జిల్లాలో బుధవారం నమోదైన వర్షపాతం (మిల్లీమీటర్లలో)

మండలం	వర్షపాతం
వీరఘట్టం	7.8
సీతంపేట	10.2
భామిని	4.2
పాలకొండ	12.2
కొమరాడ	7.6
గుమ్మలక్ష్మీపురం	2.4
కురుపాం	4.2
జియ్యమ్మవలస	12.8
గరుగుబిల్లి	23
పార్వతీపురం	5.2
మక్కువ	0.6
సీతానగరం	7.2
బలిజిపేట	14.2
సాలూరు	2.8
పాచిపెంట	0.8

నిలకడగా తోటపల్లి



తోటపల్లి ప్రాజెక్టునుంచి నదిలోకి విడిచిపెట్టిన వరదనీరు

గరుగుబిల్లి: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు వద్ద నీటిప్రవాహం నిలకడగా ఉంది. నాగావళినదిలో తోటపల్లి ప్రాజెక్టువద్ద బుధవారం సాయంత్రం 6 గంటలకు 105 మీటర్ల లెవిల్‌కు గాను 103.65 మీటర్ల లెవిల్‌లో నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం నది పైభాగం నుంచి ప్రాజెక్టుకు 3,180 క్యూసెక్కుల నీరువస్తుండగా, అధికారులు ఒక గేటును ఎత్తివేసి 2,777 క్యూసెక్కుల నీటిని నదిలోకి తిరిగి విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటిసామర్థ్యం 2.5 టిఎంసీలకు గాను 1.704 టీఎంసీలు నిల్వ ఉన్నట్టు ఏఈ కిశోర్ తెలిపారు.

మళ్లీ అక్కడే గండి



తోటపల్లి కాలువకు పడిన గండి

రెండు నెలల కిందట గండిపడిన తోటపల్లి కాలువకు మళ్లీ బుధవారం తెల్లవారు జామున ఆ ప్రాంతానికి చేరువలో గండి పడింది. బొబ్బిలి రాజాం రోడ్డు పక్కనే గల అలజంగి చెట్టు సమీపంలో 31.625 కిమీ వద్ద గట్టు కాస్త కొట్టుకు పోయింది. గతంలో ఎలుకల కన్నాలు పెద్దవై పడిన గండికి 700 మీటర్ల దూరంలో గండి పడడంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమ య్యారు. సాగునీటి వృథాను అరికట్టేందుకు కాలువలో 900 క్యూసెక్కుల నుంచి 600 క్యూసెక్కులకు నీటి ప్రవాహాన్ని తగ్గించారు. గండి వల్ల సుమారు 50 ఎకరాల వరి నాట్లు మునిగినట్టు రైతులు తెలిపారు. జలవనరుల శాఖ డీఈఈ కుమార్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, తదితరులు గండి ప్రాంతాన్ని పరిశీలించారు. రైతులను ఆదుకుంటామని చెప్పారు. గండిని వెంటనే పూడ్చుతామని తెలిపారు. .



వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు వద్ద నీటి నిల్వ



రైతులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రాజెక్టుల్లో పెరిగిన నీటిమట్టం

బొబ్బిలి: అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు జలశయాల్లో నీటిమట్టం పెరిగింది. ఇప్పటికే ఖరీఫ్ సాగుకు ఇంచుమించుగా అన్ని ప్రాజెక్టుల నుంచి అధికారులు సాగునీటిని విడిచిపెట్టారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సాగునీటికి చింత ఉండదని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ప్రాజెక్టుల సాగునీటి మట్టం(మీటర్లలో) ఇలా..

ప్రాజెక్టు	పూర్తి నీటిమట్టం	ప్రస్తుత నీటిమట్టం
తోటపల్లి	105.00	103.64
జంఝావతి	డైవర్షన్	123.65
పెదంకలాం	డైవర్షన్	
వట్టిగెడ్డ	121.62	117.23
పెద్దగెడ్డ	213.80	212.80
వీఆర్ఎస్	161.00	158.40



పార్వతీపురంలో కురుస్తున్న వర్షం

గండి ప్రాంతం పరిశీలన



భాసూరు వద్ద తోటపల్లి పిల్లకాలువకు పడిన గండి

పాలకొండ రూరల్: తోటపల్లి ఎడమ కాలువకు అనుసంధానంగా ఉన్న పిల్లకాలువకు పాలకొండ మండలం భాసూరు గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి గండి పడింది. దీంతో వర్షపునీరు సమీప పంట పొలాల్లోకి చేరింది. విషయాన్ని సర్పంచ్ గురునాయుడు ఇరిగేషన్ అధికారులకు తెలిపారు. తక్షణమే స్పందించిన ఆ శాఖ ఏఈ బి.శంకరరావు, సిబ్బంది గండి పడిన ప్రాంతాన్ని సందర్శించారు. తాజా పరిస్థితి ఉన్నతాధికారులకు నివేదించారు. యుద్ధప్రాతిపదికన పరిష్కారం చర్యలపై దృష్టి పెట్టారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



రోగులతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రజారోగ్యానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రోగులకు మెరుగైన వసతుల కల్పన, జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమం, ఆస్పత్రి అభివృద్ధికి నిధుల ఖర్చు, వైఎస్సార్ వైద్య సేవలపై చర్చించారు. ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలతో పాటు మౌలిక వసతులు కల్పించాలని రాజన్నదొర సూచించారు. ఆస్పత్రి సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. సేవలు బాగున్నాయని, రుచికరమైన భోజనం వడ్డిస్తున్నారని చెప్పడంతో సంతోషం వ్యక్తంచేశారు. మందుల కొరతలేదని, వైద్య పరీక్షల కోసం ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని వైద్యులు వివరించారు. కమిటీ సభ్యుడు డా.బంకురు అప్పలనాయుడు మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందుతుండడంతో రోగుల తాకిడి పెరిగిందన్నారు. ప్రజలకు ఉచిత వైద్యం అందుతోందన్నారు. ప్రభుత్వ చర్యలతో ప్రభుత్వాస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి



బడిబయట పిల్లలను బడిలో చేరుస్తూ వారి వివరాలను నమోదు చేస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పాలకొండ రూరల్: బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ స్పష్టం చేశారు. పాలకొండ పెద్దకాపు వీధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. బడి బయట ఉన్న ఐదుగురు పిల్లలకు పాఠశాలలో ప్రవేశాలు కల్పించారు. వారి వివరాలను స్వయంగా కంప్యూటర్‌లో నమోదుచేశారు. జిల్లాలో జీఈఆర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రోల్) శతశాతం ఉండేలా చూడాలని డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్‌కు కలెక్టర్ సూచించారు. ఇప్పటికే ప్రత్యేక డ్రైవ్ ద్వారా పాలకొండ పరిసరాల్లో 176 మందిని గుర్తించామని, వీరిలో ఇతర ప్రాంతాలకు తల్లిదండ్రులతో వలసవెళ్లిన పిల్లల విషయంతో ప్రత్యేకశ్రద్ధ వహిస్తున్నామని ఎన్‌రోల్ మెంట్ అధికారి ఆర్.విజయ్‌కుమార్ కలెక్టర్‌కు తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, అమ్మఒడి, నాడు–నేడు, విద్యాకిట్లు తదితర పథకాలను పిల్లలు, వారి తల్లిదండ్రులు అందిపుచ్చుకోవాలని కలెక్టర్ కోరారు. వారంలో జుల్లోగా బడి బయట పిల్లలను ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా బడుల్లో చేర్పించాలని సూచించారు. నాడు–నేడు రెండవ విడతలో మంజూరైన రూ.17లక్షల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓలు పి.కృష్ణమూర్తి, సీహెచ్ సోంబాబు, డీటీ బి.బుచ్చయ్య, హెచ్ఎం సీహెచ్.సోమేశ్వరరావు ఉన్నారు.

సొండి కులస్తులను ఓబీసీలో చేర్చాలి
- ఓబీసీ కమిటీ ఛైర్మన్‌ను కోరిన ఎంపీ 'బెల్లాన'

చీపురుపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో నివసిస్తున్న వెనుకబడిన సొండి కులస్తులను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్పించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కోరారు. ఏపీ సొండి కుల సంఘం ప్రతినిధులతో కలిసి న్యూఢిల్లీలో జాతీయ ఓబీసీ కమిటీ ఛైర్మన్ రాజేష్‌వర్మను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దేశంలోని బీహార్ వంటి రాష్ట్రాల్లో సొండి కులస్తులను ఓబీసీలుగా పరిగణిస్తున్నారని గుర్తుచేశారు. ఉత్తరాంధ్రలో నివసిస్తున్న సొండికులస్తులకు న్యాయం చేయాలని కోరారు.

ఆగస్టు 2న వీఆర్ఎస్ నీరు విడుదల
- గేట్లను పరిశీలించిన ఇరిగేషన్ ఎస్ఈ సూర్యకుమార్

మక్కువ: వీఆర్ఎస్ ప్రాజెక్టు నుంచి కాలువలకు ఆగస్టు 2న సాగునీటిని విడిచిపెడతామని ప్రాజెక్టు ఎస్ఈ సూర్యకుమార్ తెలిపారు. శంబర గ్రామ సమీపంలోని వెంగళరాయసాగర్ ప్రాజెక్టును, సువర్ణముఖి, గోముఖిరెగ్యులేటర్ల గేట్ల స్థితిని పరిశీలించారు. గేట్లకు గ్రీజు పెట్టి సిద్ధంచేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వీఆర్ఎస్ ప్రాజెక్టు నీటి సామర్థ్యం 161 మీటర్లు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 158.30 మీటర్ల మేర నీరు నిల్వ ఉన్నట్టు నిర్ధారించారు. ఆయన వెంట ఈఈ ఆర్.అప్పలనాయుడు, డీఈ సురేష్, జేఈ ఉన్నారు.



వీఆర్ఎస్ ప్రాజెక్టు గేట్లను పరిశీలిస్తున్న ఎస్ఈ సూర్యకుమార్

ఆర్థిక కార్యాలయాల సముదాయం ప్రారంభం రేపు



నూతన భవనం ఇదే..

- రూ.14.30 కోట్లతో మూడంతస్తుల్లో కార్యాలయ భవనం నిర్మాణం
- జిల్లా ఖజానా సహా నాలుగు కార్యాలయాల ఏర్పాటు

విజయనగరం అర్బన్: నగరంలోని కలెక్టర్ కార్యాలయ సమీపంలో కొత్తగా నిర్మించిన ఆర్థిక మంత్రిత్వశాఖ కార్యాలయాల సముదాయాన్ని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ నెల 28న ప్రారంభిస్తారని జిల్లా ఖజానా శాఖ అధికారి ఆర్ఏఎస్‌కుమార్ వెల్లడించారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అధ్యక్షత వహిస్తారని, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఖజానాశాఖ డైరెక్టర్ ఎ.మోహనరావు పాల్గొంటారని తెలిపారు. రూ.14.30 కోట్ల వ్యయంతో మూడు అంతస్తుల్లో నిర్మించిన భవన సముదాయంలో జిల్లా ఖజానా అధికారి కార్యాలయంతో పాటు, పే అండ్ అకౌంట్స్ కార్యాలయం, ఏపీ ప్రభుత్వ బీమా కార్యాలయం, జిల్లా ఆడిట్ అధికారి (స్టేట్ ఆడిట్) కార్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు.

28న ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

విజయనగరం:

ఉత్తరాంధ్ర స్థాయిలో జరగబోయే అండర్–13 బాల, బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన బోయే జిల్లాజట్ల ఎంపిక పోటీలు ఈ నెల 28న నిర్వహించనున్నట్టు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయన్నారు. 2012 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించి వారు మాత్రమే పోటీలకు అర్హులని పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో విశాఖలో జరగనున్న పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 837454 3094 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

తాటిపూడి కాలువలో వృద్ధురాలి మృతదేహం



వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గంట్యాడ: మండలంలోని తాటిపూడి కాలువలో ఓ వృద్ధురాలి మృతదేహం బుధవారం కనిపించింది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తాటిపూడి సాగునీటి కాలువలో సుమారు 65 సంవత్సరాల వయసు గల వృద్ధురాలి మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం మేరకు వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే మృతురాలి వివరాలేమీ తెలియరాలేదని ఎస్సై కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపారు. ఆమె ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయిందా? ఆత్మహత్యకు పాల్పడిందా అనేది తెలియాల్సి ఉందన్నారు.

మెడికల్‌షాపులో చోరీకి పాల్పడిన ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: కలెక్టరేట్ జంక్షన్‌లో ఉన్న మెడికల్ షాపు షట్టర్ తొలగించి క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ. 8వేలు చోరీ చేసిన ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. స్థానిక గెంజిపేట జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఫూల్‌బాగ్ కాలనీకి చెందిన తేజ స్వరూప్, కంటోన్మెంట్‌కు చెందిన పాట్నూరు సంతోష్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని విచారణచేయగా నేరం అంగీకరించారన్నారు. వారి నుంచి రూ. 5వేలు స్వాధీనం చేసుకున్నామని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. గతంలో వన్‌టౌన్ పరిధిలో ఒకటి, టూటౌన్ పరిధిలో రెండుకేసుల్లో వీరిద్దరూ నిందితులుగా నమోదై ఉన్నారన్నారు. సమావేశంలో ఎస్సై అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌ల అభివృద్ధిపై వీడియోకాన్ఫరెన్స్

విజయనగరం టౌన్: అమృత్ భారత్ రీ డెవలప్‌మెంట్ ఆఫ్ స్టేషన్స్‌లో భాగంగా విజయనగరం, శ్రీకాకుళం, చీపురుపల్లి, బొబ్బిలి రైల్వేస్టేషన్‌లు ఎంపికయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయా రైల్వేస్టేషన్‌ల అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై ఢిల్లీ నుంచి రైల్వే బోర్డు మెంబర్స్ బుధవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. విజయనగరం రైల్వేస్టేషన్ మేనేజర్ మురళీ కృష్ణ కాన్ఫరెన్స్‌కు హాజరై అభివృద్ధి చేయాల్సిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో డివిజనల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ టి.వెంకటరమణ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



పొట్టంగి సన్యాసి రావు

రామభద్రపురం: మండలంలోని తారాపురం గ్రామానికి చెందిన పొట్టంగి సన్యాసిరావు అదృశ్యమయ్యాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత నెల 29వ తేదీన అదే గ్రామానికి చెందిన 10 మంది గుడిసెల నేతకు హైదరాబాద్ వెళ్లారు. పనులు ముగించుకుని ఈ నెల 11వ తేదీన 9 మంది మాత్రమే తిరిగి గ్రామానికి చేరుకున్నారు.సన్యాసి రావు ఇంటికి రాలేదు. ఇప్పటి వరకు ఇంటికి రాకపోవడంతో గ్రామానికి చేరుకున్న 9 మందిని కుటుంబసభ్యులు వాకబు చేశారు. ఏమో తెలీదని, తామంతా ఎవరికి వారు విడివిడిగా వచ్చామని, సన్యాసిరావు ఎక్కడికి వెళ్లాడో తెలియదని చెప్పారు. అన్ని ప్రాంతాలలో ఉన్న చుట్టాలను అడగ్గా రాలేదని చెప్పడంతో ఆందోళన చెందిన భార్య తిరుపతమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,160-00
బంగారం(22సి. 10గ్రా.)	55,150-00
వెండి (కిలో)	80,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

గుర్లలో కృషి విజ్ఞాన కేంద్రం

- ఖరీఫ్‌కు ఎరువులు సిద్ధంగా ఉంచాలి
- 115 పీఎం కిసాన్ సంవృద్ధి కేంద్రాల ఏర్పాటు
- 50 శాతం రాయితీపై రాగి విత్తనాలు
- జిల్లా వ్యవసాయ సలహామండలి నిర్ణయాలు



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



హాజరైన వివిధ శాఖల జిల్లా అధికారులు



చిరుధాన్యాల సాగు పద్ధతులు, ఉపయోగాలపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటేశ్వర్రావు

విజయనగరం అర్బన్: జిల్లాలోని గుర్ల మండలం ఎస్ఎస్ఆర్ పేటలో కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి తీర్మానించింది. జిల్లాలో వర్షాలు విస్తృతంగా పడుతున్నాయని, వాతావరణ పరిస్థితి ఖరీఫ్‌కు అనుకూలంగా మారినందున, అవసరమైన ఎరువులను సిద్ధం చేయాలని, అలాగే జిల్లాలో అర్హత ఉన్న కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేసి, సహకార బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వర్రావు అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం జరిగింది. సమావేశంలో వ్యవసాయం, ఉద్యాన, పశుసంవర్థక, నీటి పారుదల శాఖలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. జిల్లాకు మంజూరైన కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఎస్ఎస్ఆర్ పేటలో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేసినట్లు అధికారులు సమావేశంలో తెలిపారు. కేవీకే ఏర్పాటుకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సరిపడా భూమి అందుబాటులో లేని పక్షంలో చీపురుపల్లి మండలంలో ఏర్పాటు చేయాలని జెడ్పీ చైర్మన్ సూచించారు. వర్షాలు సమృద్ధిగా పడుతున్నాయని, ఖరీఫ్‌కు వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. ఇప్పటికే తగినన్ని విత్తనాలను సరఫరా చేశామని, ఉభాలు మొదలు కావడంతో ఎరువులు సిద్ధం చేయాలని రైతులు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో రాగి పంటకు విస్తృత ప్రచారం కల్పించాలని జెడ్పీ చైర్మన్ కోరారు. పశుబీమా పథకాన్ని అర్హత ఉన్న రైతులకు వర్తింపచేయాలని సూచించారు. నీటిపారుదల శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎక్కడైనా గండ్లు పడితే పూడ్చేందుకు తగిన ఏర్పాట్లను సిద్ధం చేయాలని చెప్పారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా ఈకేవైసీ చేసుకునే అవకాశం ఉందని, విస్తృత ప్రచారం చేయడం ద్వారా ఈ విషయన్ని రైతులకు తెలియజేయాలని సూచించారు.

నెలాఖరులోగా ఈకేవైసీ చేయించాలి

ఈకేవైసీ చేయించుకునేందుకు రైతులకు ఈ నెలాఖరు వరకు సమయం ఉందని, ఇదే చివరి అవకాశమని చెప్పారు. ఈకేవైసీ చేయించుకున్నవారికి మాత్రమే పీఎంకిసాన్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. చిరుధాన్యాల సాగును పెంచాలని, ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహించాలని సూచించారు.

రైతులకు భరోసా కల్పించాలి

వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటేశ్వర్రావు మాట్లాడుతూ ఏ రకమైన ధాన్యాన్నయినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్న భరోసా రైతులకు కల్పించాలని కోరారు. భూసార పరీక్షలను నిర్వహించి, ఆయా భూములకు తగిన ఎరువులను సూచించాలని విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్‌లో మొక్కజొన్న వేసినప్పుడు, నీరు నిలువ ఉన్న చోట పంట రంగుమారి, సమస్య వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు దీనికి తగిన పరిష్కారాన్ని రైతులకు తెలియజేయాలని కోరారు. వ్యవసాయ శాఖ అజెండాను, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు వివరించారు. జిల్లాలో 50 శాతం రాయితీపై రాగి విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతుల్లో అవగాహన కల్పించేందుకు జిల్లాలో ఎంపిక చేసిన 115 ఎరువుల షాపుల్లో పీఎంకిసాన్ సంవృద్ధి కేంద్రాలను గురువారం ప్రధాన మంత్రి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. చిరుధాన్యాల సాగు పద్ధతులు, ఉపయోగాలపై వ్యవసాయ శాఖ ప్రచురించిన పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు వాసుదేవరావు, వెంకటేశ్వర్రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో బాల్య వివాహాలు నివారిద్దాం

- ఐసీడీఎస్ పీడీ విజయగౌరి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ విజయగౌరి

పార్వతీపురం: సమష్టి కృషితో బాల్య వివాహాలను నివారిద్దామని ఐసీడీఎస్ పీడీ కె.విజయగౌరి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక బాలికల ఉన్నతపాఠశాలలో బాల్యవివాహాలు, బాలల చట్టాలు, బాలల సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం 2006 ప్రకారం అమ్మాయిలకు 18 ఏళ్లలోపు, అబ్బాయిలకు 21 ఏళ్లలోపు వివాహం చేస్తే చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. బాల్యవివాహాల కారణంగా కలిగే సామాజిక, ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ పార్వతీపురం మన్యం జిల్లా అధికారి అల్లు సత్యనారాయణ, బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి తవిటినాయుడు, ఇన్‌చార్జ్ హెచ్ఎం శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుర్లలో బంగారు ఆభరణాల చోరీ

మెంటాడ: మండలంలోని గుర్ల గ్రామంలో ఈనెల 25 అర్ధరాత్రి తమ ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న బంగారు నగలతో పాటు వెండి వస్తువులు,నగదును అపహరించుకు పోయినట్లు గ్రామానికి చెందిన కోరాడ పెంటమ్మ బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఆంధ్ర ఎస్సై సిద్ధార్థ నాయుడు తెలిపారు. పెంటమ్మ ఉదయం పొలం పనులకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఇంటికి చేరుకుని చూడగా బీరువాలో 9 తులాల బంగారు ఆభరాలు, 10 తులాల వెండి వస్తువులు, రూ.2 లక్షల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఇంటి పరిసర ప్రాంతాలను క్లూస్ టీంతో పాటు, డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆగస్టు 6న జిల్లా స్థాయి యోగా పోటీలు

పార్వతీపురంటౌన్: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, పార్వతీపురం మన్యం జిల్లా ఆధ్వర్యంలో ఆగస్టు 6న ఉదయం 8గంటలకు పార్వతీపురం రాయగడ రోడ్‌లో గల శ్రీ సూర్యపీఠంలో జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి మోహన్ గంతాయత్ తెలిపారు. ఈ పోటీల్లో సబ్ జూనియర్స్ 9 నుంచి 14 ఏళ్లు, జూనియర్స్ 14 నుంచి 18 ఏళ్లు, సీనియర్స్ 18 నుంచి 28 ఏళ్ల బాలబాలికలు అర్హులు. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్ సింగిల్, ఆర్టిస్టిక్ పెయిర్, రిథమిక్ పెయిర్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా స్థాయి విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. అక్కడ ప్రతిభ కనబరిచిన వారు నేషనల్ లెవెల్‌లో ఖేలో ఇండియాకి అర్హత సాధిస్తారని వివరించారు. ఆసక్తి గల బాలబాలికలు ఆగస్టు 3వ తేదీలోపు ఫోన్ 9985349980 నంబర్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన వ్యక్తి అప్పల స్వామి (ఫైల్)

బాడంగి: మండలంలోని డొంకినవలస స్టేషన్‌లో రైలు ఢీకొని మంగళవారం రాత్రి ఓ వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. బహిర్భూమికి వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొందని మృతుడిని రైల్వే కాలనీలో నివాసముంటున్న సిరిసెట్టి అప్పలస్వామి(31)గా గుర్తించి నట్లు చెప్పారు. అప్పలస్వామి వంటలమేస్త్రీగా పనిచేస్తుంటాడని, ఆయనకు భార్య భూలక్ష్మి, ఇద్దరు పిల్లలున్నారని తెలిపారు. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు బొబ్బిలి రైల్వే హెచ్‌సీ కృష్ణారావు, సిబ్బంది బుధవారం హాజరై కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించారని, పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించామని తెలిపారు.

గాయపడిన వ్యక్తి..

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద టీడీపీ ర్యాలీకి వెళ్లి వస్తూ ట్రాక్టర్ ఢీకొని గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు.ఈనెల 11వ తేదీన చింతలబెలగాం గ్రామానికి చెందిన మర్రాపు శ్రీనివాసరావు, ఎం.తిరుపతిరావులు టీవీఎస్ ఎక్సెల్‌పై టీడీపీ ర్యాలీకి వెళ్లి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొని గాయపడిన సంగతి విదితమే. మర్రాపు శ్రీనివాసరావుకు తీవ్రగాయాలు కాగా విశాఖపట్నంలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

పిడుగుపాటుతో గేదె..

లక్కవరపుకోట: మండలంలోని నిడుగట్టు గ్రామంలో పిడుగుపాటుకు గురై యర్రా కృష్ణకు చెందిన చూడిగేదె మృతి చెందింది. బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా పెద్ద ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో పొలంలో మేస్తుండగా సమీపంలో పిడుగు పడడంతో పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని బాధితుడు లబోదిబోమంటూ తెలిపాడు. సమాచారం మేరకు డిప్యూటీ తహసీల్దార్ వి.రాజేష్ ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేశారు.

పేదోడి సొంతింటి కల సాకారం



టిడ్కో ఇళ్ల నిర్మాణం పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర
- ఆగస్టులో సాలూరులో 1,026 టిడ్కో గృహప్రవేశాలు

సాలూరు: పేదవాడి సొంతింటి కల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాకారమవుతోందని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్‌లు అన్నారు. ఈ మేరకు బుధవారం వారు సాలూరు పట్టణంలోని టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి రాజన్నదొర మాట్లాడుతూ, ఈ స్థలాన్ని 2006లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే సేకరించానని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేయడానికి స్థల సమస్య కూడా లేదని అయినా నాటి పాలకులు, ఇళ్ల నిర్మాణం ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. అంతేకాకుండా లబ్ధిదారులైన పేద ప్రజల తలపై సుమారు రూ.7 లక్షల అప్పు పెట్టాలని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు చూశారని విమర్శించారు. కాగా నేడు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పేద అర్హులైన లబ్ధిదారులకు ఆ అప్పు లేకుండా చేయడంతో పాటు సుమారు రూ.10 లక్షల విలువైన ఆస్తిని ఇస్తున్నారని వివరించారు. ప్రజలు ఈ వాస్తవాలను గ్రహించి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించి ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు.

ప్రారంభించిన వదిలేసిన టీడీపీ

టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, 5 ఏళ్ల అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం హయాంలో ఈ ఇళ్లను ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నించారు. వారి హయాంలో నిర్మాణాలు ప్రారంభించి పునాదుల స్థాయిలోనే విడిచిపెట్టేశారని ఎద్దేవా చేశారు. వారి పాలనలో ఇళ్ల నిర్మాణం చేయలేని టీడీపీ నాయకులు నేడు సెల్ఫీలు తీసుకుంటూ విమర్శలు చేయడం హేయమన్నారు. సాలూరు,పార్వతీపురంలలో చేపట్టిన టిడ్కో ఇళ్లకు రివర్స్‌టెండరింగ్ జరిగిందని గుర్తుచేశారు. సాలూరులో ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ప్రత్యేక పర్యవేక్షణలో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రోడ్లు, నీటిసాకర్యం కల్పన తుది దశకు చేరుకున్నాయని వివరించారు. ఆగస్టులో ఇక్కడ 1,026 టిడ్కో ఇళ్లలో లబ్ధిదారులు గృహప్రవేశం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో నాణ్యమైన వైద్యసేవలు


- ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ



జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ ఇస్తున్న వైద్యాధికారులు

విజయనగరం ఫోర్ట్: ప్రజల ఆరోగ్యం కోసం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోంది. ఇందుకోసం కోట్లాది రుపాయలు ఖర్చు చేస్తూ . గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని చేపట్టింది. కార్యక్రమంలో భాగంగా నెలలో రెండు పర్యాయాలు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అక్కడికి వచ్చేవారికి బీపీ, సుగర్ తదితర వైద్య పరీక్షలు చేయడంతో మంచంపై లేవని లేని వారి ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. అయితే గ్రామాల్లో ఉండి వారికి నిరంతరం వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వం ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్)లను నియమించింది. జిల్లాలో 482 ఎంఎల్‌హెచ్‌పీలు ఉన్నారు. విలేజ్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లలో వీరు పనిచేస్తున్నారు. ప్రతి ఆరోగ్య సమస్యకు ప్రజలు ఆస్పత్రికి వెళ్లకుండా గ్రామస్థాయిలోనే అన్ని రకాల వైద్య సేవలు ప్రజలకు అందించేవిధంగా ఎంఎల్‌హెచ్‌పీలను నిష్ణాతులను చేయడం కోసం ప్రభుత్వం వారికి అవసరమైన శిక్షణ ఇప్పిస్తోంది. ఇప్పటికే కొంత మందికి శిక్షణ పూర్తయింది. మరికొంతమంది ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు.

పూర్తి స్థాయిలో వైద్యసేవలు



ప్రజలకు నూటికి నూరుశాతం పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఎంఎల్‌హెచ్‌పీలను నియమించింది. వారికి అన్ని రకాల వైద్య సేవలు ఏవిధంగా అందించాలన్న దానిపై శిక్షణ ఇప్పిస్తున్నాం. ఇది వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

డాక్టర్ ఎస్. భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

29న మాస్టర్ మైండ్స్ సంస్థ 'ప్రతిభా పురస్కారాలు'

విజయనగరం అర్బన్: జిల్లాలో ప్రతిభ చూపిన జూనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ నెల 29న స్థానిక కోట జంక్షన్‌లోని హోటల్ ఆనంద్ గ్రాండ్ ఫోర్ట్‌లో 'ప్రతిభా పురస్కారాలు' అందజేస్తామని మాస్టర్ మైండ్స్ సంస్థ వైజాగ్ బ్రాంచ్ అడ్మిన్ ప్రిన్సిపాల్ సీహెచ్.అంజిరెడ్డి ప్రకటించారు. ఈ మేరకు సంస్థ అడ్మిన్ ప్రిన్సిపాల్ బుధవారం పేర్కొన్నారు. రాష్ట్ర సిలబస్‌తో 2023 ఏప్రిల్ 26న విడుదల చేసిన ఫలితాల్లో ఎంపీసీ గ్రూప్‌లో 430, ఆపైన మార్కులు, బైపీసీ గ్రూప్‌లో 400. ఆపైన మార్కులు, ఎంఈసీ గ్రూప్‌లో 470. ఆపైన మార్కులు, సీఈసీ గ్రూప్‌లో 450 ఆపైన మార్కులు పొంది ప్రతిభ చూపించిన విద్యార్థులను సత్కరించి ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఆరోజు సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అర్హులైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు నగదు బహుమతి ఇవ్వనున్నామని తెలిపారు. అర్హులైన విద్యార్థులు గుర్తింపుకార్డు (ఆధార్ కార్డు/కాలేజీ ఐడీ కార్డు), జూనియర్ ఇంటర్‌మీడియట్ పరీక్షల్లో సాధించిన మార్కుల జాబితా (ఇంటర్నెట్ కాపీ) తీసుకుని రావాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ కోసం ఫోన్ నంబర్స్ 9248722267 లేదా 9676553642లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- గురుకులం అధికారులను హెచ్చరించిన ఎమ్మెల్యే జోగులు



విజయనగరం, శ్రీకాకుళం జిల్లా కన్వీనర్లు, గురుకులం సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

వంగర: విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కంబాల జోగులు హెచ్చరించారు. విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మండల పరిధి మడ్డువలసలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకులాన్ని సందర్శించారు. ఇటీవల కలుషిత ఆహారం తిని అస్వస్థకు గురైన విద్యార్థులను రాజాం సీహెచ్‌సీతోపాటు గురుకులంలో కలిసి యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో సమీక్షించారు. అనంతరం మడ్డువలస గురుకులంలో అధికారులతో కలియదిరిగి పరిసరాలు, భోజనశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచాలని గురుకులం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గొర్లె సూర్యకుమారిని ఆదేశించారు. గురుకులంలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడేంత వరకు పర్యవేక్షించాలని విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల గురుకులాల కన్వీనర్లు తోట పద్మజ, ఎన్.బాలాజీనాయక్‌లను ఎమ్మెల్యే ఆదేశించారు.

గురుకులాన్ని సందర్శించిన ఆర్డీవో

మడ్డువలస గురుకులాన్ని చీపురుపల్లి ఆర్డీవో ఎం.అప్పారావు సందర్శించారు. కలుషిత ఆహారం తిని అస్వస్థలకు గురై విద్యార్థులతో మాట్లాడారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

విద్యార్థులు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కన్వీనర్లు టి.పద్మజ, ఎన్.బాలాజీ నాయక్ అన్నారు. ఈ మేరకు వారు గురుకులాన్ని సందర్శించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గొర్లె సూర్యకుమారితో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావిల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, తహసీల్దార్ డి.ఐజాక్, ఎంఈవో వై.దుర్గారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బూరాడ వెంకటరావు, కనగల పారినాయుడు, కిమిడి సన్యాసినాయుడు, పోలిరెడ్డి రమేష్, కాబోతుల శ్రీనివాసనాయుడు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాన్ని సందర్శించిన రాష్ట్ర కార్యదర్శి

మండల పరిధి మడ్డువలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి ఆర్.పావనమూర్తి బుధవారం రాత్రి సందర్శించారు. గురుకులంలో 27 మంది విద్యార్థినులు కలుషిత ఆహారం తినడంతో అస్వస్థతకు గురైన ఘటన పాఠకులకు విధితమే. ఈ విషయంపై రాష్ట్ర కార్యదర్శి గురుకులాన్ని సందర్శించి ఘటనకు గల కారణాలను గురుకులాల జిల్లా సమన్వయకర్త తోట పద్మజతో పాటు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గొర్లె సూర్యకుమారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అస్వస్థతకు గురైన విద్యార్థినులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో జిల్లా గురుకులాల సమన్వయకర్త తోట పద్మజ, గురుకులం సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారులు చైతన్యవంతులు కావాలి

విజయనగరం లీగల్: వినియోగదారులు చైతన్యవంతులు కావాలని జిల్లా వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి ఆర్.వి. నాగసుందర్ అన్నారు. ఈ మేరకు స్థానిక శ్రీ చలపతి స్కూల్‌లో బుధవారం నిర్వహించిన 'అడగండి..చెబుతాం 'అనే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులు వస్తువులు కొనేటప్పుడు దుకాణదారుల నుంచి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. వినియోగదారుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు సంబంధిత ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. వినియోగదారులకు సేవలు అందించేందుకు జిల్లా వినియోగదారుల కోర్టు ఎల్లవేళలా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అనంతరం వినియోగదారుల అవగాహన కోసం వాల్‌పోస్టర్‌ను న్యాయమూర్తి నాగసుందర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీ చలపతి స్కూల్ అధినేత కోరాడ రాజేష్, కన్స్యూమర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధితుల తక్షణ ఉపశమనానికి చట్టాలు

- హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్

విజయనగరం టౌన్: ప్రజలకు సత్వర న్యాయం చేకూరేందుకు మానవ హక్కుల కోర్టులను ప్రతి జిల్లాలో ఏర్పాటుచేయాలని, మానవహక్కుల కమిషన్‌లకు అధికారాలపై పార్లమెంటులో చట్టం చేసి బాధితులకు తక్షణ ఉపశమనం లభించేలా చట్టాలు చేయాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక రైల్వే ఇనిస్టిట్యూట్‌లో బుధవారం వివిధ జిల్లాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాజ్యాంగం దేశ ప్రజలందరికీ గౌరవప్రదంగా జీవించే హక్కు కల్పించినప్పటికీ హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మానవ హక్కుల కౌన్సిల్ నుంచి పౌరుల హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మానవ హక్కులు, ఇతర చట్టాలపై సంస్థ ప్రతినిధులతో యువత, విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఉపాధ్యక్షుడు ఎస్‌వి.రమణ పేర్కొన్నారు. ఎవరైనా బాధితులు సమస్యలను విన్నవించుకోవాలంటే జిల్లా బాధ్యుడిగా వ్యవహరిస్తున్న ప్రసాద్, సెల్‌నంబర్ 8886214455కు తెలపాలని సూచించారు. సమావేశంలో కౌన్సిల్ సభ్యులు ప్రసాద్, రావాడ నాయుడు, కోరుపోలు సత్యారావు తదితరులు పాల్గొన్నారు.